# ఊర్మిక



రావూరి భరద్వాజ

నేనేదో మహా అనుభవం ఉన్నవాణ్నని కాదుగానీ, రకరకాల మనుషులతో నాకూ పరిచయం వుంది. కొందరితో స్నేహం చేశాను. కొందరిని ఆప్తులుగా భావించాను. ఇంకో బాపతు జనాన్ని వుంచవలసినంత దూరంగానూ వుంచాను. లోకంలో రకరకాల మనస్తత్వా లున్న వారుంటారని, నాకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకంటే—నాకున్న పరిచయస్థుల్లో, చాలా రకాల వారూ, అనేక వర్గాలకు చెందినవారూ వున్నారు. వారి వారి అభిప్రాయాలతో, నాకు ఏకీభావం కుదరని సందర్భాలు బొచ్చెడున్నాయి. అంతమాత్రాన వారంతా నా విరోధులని, నే నెట్లా అనను?

ఎవరి గొడవ వారిదీ, కవరి కష్టసుఖాలు వారివీను! నేను ఆర్చేవాణ్నీ తీర్చేవాణ్నీ కాదు. ఇట్లా సరిపెట్టుకొనే, నేను శివరామయ్యగార్ని ఏమీ అనేవాణ్ని కాదు. చూడటానికి శివరామయ్య చాలా సాత్వికుడుగానూ, మాంఛి వ్యవహారవేత్తగానూ వుండేవాడు. భాగ్యమ్మగారు గూడా ఆయనకు తగ్గదే ననిపించింది. అదీగాక – వాళ్ళు చాలా కాలం క్రిందటే మద్రాసులో స్థిరపడిపోయిన తెలుగువాళ్ళు. సగం అందుకే నే నా యింట్లో ప్రవేశించాను.

ఏదైనా తింటేగానీ రుచి తెలియదు. దిగితేగానీ లోతు తెలియదు. ఆ ఇంట్లో మూణ్నెల్లపాటు, అప్పసంగా, నేనుండకపోయినట్లయితే, శివరామయ్య ఇలాంటివాడని—హరిహరాదులు చెప్పినా నమ్మేవాణ్ని గాదు. పైకి సాధువులుగా కనిపించే వారిల్లో, ఎంతటి రాక్షసత్వం దాగి వుండటానికి అవకాశం వుందో, ఆయన్ను చూసిందాకా, నాకు తెలియదు.

భార్యాభర్తలన్న తరవాత, మాటా మాటా రావడమూ, కీచులాడుకోవడమూ, సహజం కావచ్చు. వాళ్ళ గొడవతో మనకెందుకులెస్తూ—అనే; వాళ్ళ కీచులాటల్లో నేను వేలు బెట్టేవాణ్ని కాదు.

నా భార్యను గూడా అటు కేసి వెళ్ళవద్దని గట్టిగా చెప్పాను.

భార్యల్ని వేపుకు తినడం గూడా వ్యాధి కిందికే వస్తే, శివరామయ్యా ఆ జబ్బులో బాగా తీసుకొంటున్న వాడి కిందికే వస్తాడు. ఆయన, పెళ్ళాన్ని అనరాని మాట లనే వాడు. నిమిష నిమిషానికీ, కొట్టటానికి మీది మీదికి పొయ్యే వాడు. ఆయనున్న కాసేపూ ఇల్లు యుద్ధ రంగంలా వుండేది.

నే నిది చాలా కాలం భరించాను. చాలా కాలం పస్తాయించాను. ఆఖరికి వుండబట్టలేక, ఒక రోజున తెగబడ్డాను.

'అది నా స్వంత విషయం! ఇందులో మీ జోక్య మేమీ లేదు.' అన్నాడాయన.

ఇలాంటి సమాధానమే వస్తుందని నాకు తెలుసు. అప్పుడు నేను నోరు మూసుకోవలసి వస్తుందని గూడా తెలుసు. ఇన్ని తెలిసి గూడా మరెందుకు తల దూర్చవయ్యా—అని, నన్నడక్కండి! భాగ్యమ్మ పడే చిత్రహింసలు చూడలేక నే తల దూర్చాను.

నే నలా జోక్యం చేసుకోవడం చాలా మంచిదే అయింది. శివరామయ్యా, పెళ్ళాన్ని కాల్చుకు తినడం తగ్గిపోయింది. ఓ మంచి పని చేశానన్న సంతృప్తి కలిగింది.

అయితే—ఇంతకు రెండింతలు, ఆమెను రహస్యంగా వేధించుకు తింటున్నాడని, భాగ్యమ్మ గారు చెప్పిం దాకా నాకు తెలియలేదు. ఆమె నా దగ్గర, తన సొదంతా వెళ్ళబోసుకొంది.

'అయ్యో, నాయనా! నువ్వలా నన్ను వెనకేసుకు రాకపోయినా బావుణ్ను.' అనికంట తడిబెట్టుకొంది భాగ్యమ్మగారు.

'ఏమయిం దేమిటండి?' అన్నాను.

'ఆ పాపిష్టి మాటలన్నీ నా నోట మళ్ళా ఎందుకు చెప్పిస్తావు నాయనా!' అన్న దామె, తప్పుకొంటూ.

నేను మా ఆవిణ్ను పిలిచి అడిగాను!

'ఆఁ ఈ మొగజాతి కేముందీ! పెళ్ళాల్ని కాల్చుకు తినడ మొక్కటే చాతవును.' అన్న దావిడ.

'అది సరేనే! భాగ్యమ్మగారు నన్ను చూసి, కళ్లనీళ్లు పెట్టుకొంటుం దేమిటీ? నే నేం చేశాను?' అన్నాను.

'అప్పటికీ నేను వద్దు మొర్రో అంటుంటిని. నా మాట వినక పోతిరి. అనవసరంగా వెళ్లి వేలు పెడితిరి. ఇప్పుడు భాగ్యమ్మగారి పీకలమీది కొచ్చింది... అది గాదండీ! మంచివాళ్లతో మంచి గానీ, ఇలాంటి లుచ్చాలతో మంచేమిటండీ నా బొంద? 'వాడికీ నీకూ ఏమీ లేకపోతే, వాడెందుకు నీ తరఫున వస్తాడూ' అన్నాట్ట శివరామయ్య. 'ఈ ఉద్దేశ్యంతో నేనా, వాడిదగ్గర అడ్వాన్సు పుచ్చుకొన్నదీ!' అన్నాట్ట. 'ఇలా ఎంత కాలం నుంచి రంకు సాగిస్తున్నావ్?' అన్నాట్ట. ఆ మానవురాలు, నిన్నట్నించీ, గంగ ముట్టకుండావుంది! మీ రేం చేసినా, ఇలాగే చేస్తారు. దోవనబొయ్యే తద్దినాన్ని నెత్తికి చుట్టుకొన్నారు. అనుభవించండి!' అన్నదావిడ.

భార్యల్ని అనుమానించే భర్తలు నాకు తెలుసు. అలాంటి భర్తలు, పెళ్ళాల్ని పెట్టే రంప కోతా నాకు తెలుసు. కానీ ఇదేమిటీ? ఆవిడకూ నాకు పొత్తేమిటి? కనీసం ఆవిడ కొడుకు వయస్సు గూడా నాకు లేదే?

శివరామయ్య ముఖం చూడ్డానికే డోకేసింది. ఇలాంటి దగుల్బాజీ కొంపలో ఒక్క క్షణం గూడా వుండ గూడదనుకొన్నాను. ఇప్పుడే ఇంతమాట అన్నవాడు— రేపు ఇంకేమైనా అంటాడు.

ఆ తెల్లవారే, ఇంకో ఇంట్లోకి మారాను. కనీసం మాట మాత్రమైనా 'ఎందుకు మారుతున్నా'రని శివరామయ్య అడగలేదు. ఆయన ముఖం చూస్తే, 'ఈ పీడా ఎప్పుడు వదిలిపోతుంది భగవంతుడా' అన్నట్టుంది.

అయితే వారం తర్వాత గానీ నాకు అసలు సంగతి తెలియలేదు. నేను ఖాళీ చేసిన సాయంత్రమే, నాకంటే పదిహేను రూపాయలు ఎక్కువ అద్దెను శర్మ ఆ యింట్లో చేరాడు.

శివరామయ్య, భార్యను ఎందుకు అనుమానించిందీ అప్పుడు నా కర్థమయింది. రేపు శర్మకన్న మరో అయిదు రూపాయలు ఎక్కువిచ్చేవాడు దొరికినప్పుడు, శివరామయ్య, మళ్ళీ భార్యను అనుమానిస్తాడు. ఆవిడ శర్మముందు, మళ్లీ కళ్లెంట నీళ్లు పెట్టుకొంటుంది.

నాకు పట్టుకొన్న బాధల్లా ఒకటే మొగవాడు గనక శివరామయ్య ఏదో అఘోరించాడు; ఈ భాగ్యమ్మ కెట్లా బుద్ధిలేదా — అని?

★

అత్యుత్తమ శాస్త్రీయ గ్రంథం।

# వివాహ చరిత్ర

హేవలాక్ ఎల్లీస్ రచనకు, "క్రాంతినాధ్"

అనుసరణ

అనాది కాలంనుండి, ఈ నాటివరకూ, వివిధ దేశాలలో, అమలులో ఉన్న, వివాహ కార్యక్రమాన్ని గురించి, తెలుగులో వెలువడిన, మొట్టమొదటి శాస్త్రీయ గ్రంథమిది: ఎన్నో ఉదాహరణలతోనూ, వివరాలతోనూ, ప్రతివారికీ అర్థమయ్యే రీతిగా వ్రాయబడింది.

పుస్తకం వెల రూ 1_0_0 మాత్రమే.

ప్రతులకు;

అభిసారిక కార్యాలయం

4, బాలుమొదలి వీధి, మద్రాసు-17.